రహదారుణాలు



సేవా రహదారిలో ప్రమాదకరంగా మ్యాన్‌హోల్

మసీదురోడ్డు వెనక రహదారి మధ్యలో ఊడిన పలకలు

వైశాఖి స్పోర్ట్స్ పార్కు అనుబంధ రహదారిని ఆనుకుని పలకలు విరిగి ప్రమాదకరంగా మారిన కాలువ

వైశాఖి స్పోర్ట్స్ పార్కు మలుపు వద్ద ప్రమాదకరంగా కాలువ

ప్రమాదకరంగా మారిన మురళీనగర్-మాధవదార మలుపు



ప్రమాదకరంగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం మెట్టు

మురళీనగర్: మురళీనగర్ పరిసర ప్రాంతాల్లో రహదారులు దారుణంగా ఉన్నాయి. అడుగుకో గొయ్యి..గజానికో గుంతలా ఉన్నాయి. ఒక్కో చోట ఒక్కో రకమైన ప్రమాదకర పరిస్థితులు నెలకొనడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రహదారి మలుపులు వద్ద వాహన చోదకులు ప్రమాదాల ప్రమాద హెచ్చరికలు లేకపోవడంతో తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. మాధవదార రహదారి అనుబంధంగా వైశాఖి స్పోర్ట్స్ పార్కు వెళ్లే రహదారిలో రోడ్డు అంచున ఉన్న కాలువపై పలకలు విరిగిపోయి ప్రమాదకరంగా మారాయి. వాకర్స్ క్లబ్‌నుంచి వైశాఖి స్పోర్ట్స్ పార్కుకు వెళ్లే రహదారి మలుపు వద్ద కాలువకు రక్షణకు చర్యలు లేవు. సెక్టార్-3 నుంచి అయ్యప్పనగర్ మసీదు వెనక రహదారి కలిపే కాలువపై ఏర్పాటు చేసిన మ్యాన్ హోల్ పలకలు ఊడిపోవడంతో వాహన చోదకులు హోల్ మధ్యలో పడి తీవ్ర గాయాలపాలవుతున్న సంఘటలున్నాయి. చిన్న పిల్లలు ఆడుకుంటున్నప్పుడు గొయ్యిలో ప్రమాదవశాత్తు జారి పడి కాళ్లు విరగగొట్టుకుంటున్నారు. మాధవదార మురళీనగర్ జాతీయ రహదారి అనుబంధంగా నిర్మించిన సేవా రహదారి మధ్య మ్యాన్ హోల్ రహదారికి ఎత్తులో ఉండడంతో రాత్రి పూట ప్రమాదాలు జరుగుతున్నాయి. వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయం కలిపే నెహ్రూ కాలనీ రహదారి ఆనుకుని నిర్మించిన శానిటరీ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం మెట్లు రహదారి పైకి నిర్మించడంతో ప్రమాదకరంగా తయారయ్యింది. అందరికీ నిబంధనలు వల్లె వేసే అధికారులే ఈ భవనం మెట్లు రహదారిపైకి వచ్చినా దీన్ని పట్టించుకోలేదు. మాధవదార-మురళీనగర్ 48 బస్సు రూటులో రహదారి మధ్యలో రహదారి ధ్వంసమైంది. ప్రమాదాల నివారణకు అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అలరించిన వినోదాల విందు



స్కిట్ ప్రదర్శిస్తున్న క్లబ్ కళాకారులు

సీతంపేట: ఫ్రెండ్స్ కామెడీక్లబ్ ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన వినోదాల విందు కామెడీ స్కిట్స్ అలరించాయి. క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎంవీ సుబ్రహ్మణ్యం నేతృత్వంలో క్లబ్ కళాకారులు జబర్దస్త్ ప్రకాష్, ఎంవీ సుబ్రహ్మణ్యం, వేంకటేశ్వరరావు, పోర్టు శేషు, భాను ప్రకాష్, శివజ్యోతి, పుష్యమి, ఈశ్వరరావు, సీత ప్రదర్శించిన కామెడీ స్కిట్స్ ప్రేక్షకులను నవ్వుల్లో ముంచెత్తాయి. వీటిలో వడ్డాణం, సెల్‌ఫోన్, నూడుల్స్, పెదవి చిట్లింది, తాగుబోతు, కోర్టు సీన్, దొందుకు దొందే, డాక్టర్ పేషెంట్, లవర్ మీద కేసు, ప్రూఫ్, 4 సిమ్స్, రివర్స్ పంచ్, డైమండ్ నక్లెస్, ముందు జాగ్రత్త స్కిట్స్ కడుపుబ్బా నవ్వించాయి. ముందుగా హరిహర నృత్య నికేతన్ గురువు అల్లు వెంకట రమణ శిష్యులు అనూష, అనన్య ప్రదర్శించిన సంప్రదాయ నృత్యాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో తిలక్ పట్నాయక్, సన్‌మూర్తి, మల్యాద్రి పాల్గొన్నారు.

క్లుప్తంగా

అలరించిన త్యాగరాజ పంచరత్న సేవ



పంచరత్న సేవలో పాల్గొన్న గాయనీమణులు

సీతంపేట: కార్తికేయ కళాక్షేత్రం ఆధ్వర్యంలో స్థానిక బీవీకే కళాశాలలో శ్రీత్యాగరాజ ఆరాధనోత్సవం ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా ఉదయం పంచరత్నాకర సేవ జరిగింది. పలువురు గాయనీమణులు పాల్గొని త్యాగరాజ స్వామి కృతి పర్చిన జగదానంద కారక, దుడుకు గల , సాధించెనే, కనకన రుచిరా, ఎందరో మహానుభావులు కీర్తనలు ఆలపించి త్యాగరాజ స్వామికి సంగీత సేవ నిర్వహించారు. సాయంత్రం హైదరాబాద్‌కు చెందిన గాయకుడు శ్రీరామ్ జొన్నల గడ్డ ఆలపించిన త్యాగరాజ కీర్తనలు అలరించాయి. ఈ సందర్భంగా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో నిర్వహించిన త్యాగరాజ కీర్తనల పోటీలో సుమారు 250 మంది పాల్గొన్నారు. పోటీలో గెలుపొందిన విజేతలకు అతిథులు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్తికేయ కళాక్షేత్రం వ్యవస్థాపకులు నిష్టల కృష్ణవేణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కళాభారతి కార్యదర్శి గుమ్ములూరి రాంబాబు, బీవీకే చైర్మన్ ఆచార్య జి. నాగేశ్వరరావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

వైభవంగా బల్లల పండగ



కార్పొరేటర్‌కు ఆహ్వానం పలుకుతున్న మహిళలు

మత్రిపాలెం: ఆర్‌అండ్‌బీ జంక్షన్ సమీపంలో ఉన్న శ్రీ వేంకటేశ్వర రజక సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన బల్లల పండగలో 51వ వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సంఘం సభ్యులు, మహిళలు ఆయనకు పుష్పగుచ్ఛం అందజేశారు. అలాగే మాధవధార మామిడితోటలో విశాఖ లైటింగ్స్ అండ్ సౌండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో కూడా రెయ్యి వెంకటరమణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు ఆయనను సత్కరించారు.

ఘనంగా ఉపాధ్యాయ సంఘం ఆవిర్భావ దినోత్సవం



ప్రతిజ్ఞ చేస్తున్న ఉపాధ్యాయులు

సీతమ్మధార: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం ఆవిర్భావ దినోత్సవాన్ని, వసంత పంచమి వేడుకలను జిల్లా శాఖ ఆధ్వర్యంలో స్థానిక నెహ్రూ మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ప్రధాన కార్యదర్శి పి.త్రినాథమూర్తి మాట్లాడుతూ విద్యార్థుల్లో జాతీయ భావం పెంచేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకుడు అయినాల అప్పారావు ఎం.పీ. శ్రీనివాస్, ఆర్థిక కార్యదర్శి విశ్వనాథం, మహిళా కార్యదర్శి రామలక్ష్మి, జిల్లా ఉపాధ్యక్షుడు సుదర్శన పట్నాయక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ద్వారకా క్రైం ఏఎస్‌ఐకి సత్కారం



సత్యనారాయణనను సత్కరిస్తున్న ద్వారకా క్రైం పోలీసులు

సీతమ్మధార: నగర పోలీసు శాఖలో విధులు నిర్వర్తించి, ఉద్యోగ విరమణ చేసిన ద్వారకాస్టేషన్ క్రైం ఏఎస్‌ఐ నీరుకొండ సత్యనారాయణనను క్రైం ఏసీపీ వెంకటరావు, ద్వారకా క్రైం సబ్ డివిజన్ సీఐ, చక్రధర్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా పలువురు అధికారులు మాట్లాడుతూ పోలీస్ శాఖలో 40 ఏళ్లకు పైగా విధులు నిర్వహించడం గొప్ప విషయమన్నారు. విధి నిర్వాహణలో ప్రతిభ కనబరిచిన సత్యనారాయణకు 2024లో ఉగాది సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఉత్తమ సేవా పతకం లభించింది. 1984లో ఉద్యోగంలో చేరిన ఆయన ఇప్పటి వరకు నగరంలోని పలు పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహించారు. కార్యక్రమంలో ద్వారకా లా అండ్ ఆర్డర్ సీఐ వీవీ రమణ, క్రైం ఎస్‌ఐలు రాజు, సత్యారావు, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ విధానాలపై పోరాటం



నెల్లిమర్ల అమరవీరుల వర్ధంతి సభలో మాట్లాడుతున్న ఐఎఫ్‌టీయూ కొండయ్య

మత్రిపాలెం: దేశంలో ఆనాటి పాలకవర్గాల నూతన ఆర్థిక విధానాలు, పారిశ్రామిక విధానాలకు వ్యతిరేకంగా నెల్లిమర్ల అమరువీరులు పోరాడారని ఐఎఫ్‌టీయూ సీనియర్ నాయకుడు వై.కొండయ్య తెలిపారు. ఆదివారం విశాఖలోని ఏకలవ్యకాలనీలో జరిగిన సంస్మరణ సభలో ఆయన మాట్లాడారు. నెల్లిమర్ల కార్మిక వర్గం సమస్త ప్రజల మద్దతు కూడ గట్టి ప్రత్యామ్నాయ సమరశీల పోరాటాలు చేసిందని గుర్తు చేశారు. మూడు దశాబ్దాలుగా పాలక వర్గాలు అనేక మోసపూరిత విధానాలను అమలు చేస్తూ, కార్మిక హక్కులను, ప్రజల హక్కులను కాలరాస్తున్నాయని, మరీ ముఖ్యంగా ఒక దశాబ్ద కాలంలో ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ నేతృత్వంలో మౌలికంగానే విధానాలను మార్చే పనికి పూనుకున్నారన్నారు. ఈ క్రమంలో 4 లేబర్ కోడ్‌లను, 3వ్యవసాయ చట్టాలను తెచ్చారని, ఇదే విధంగా ప్రభుత్వ రంగ సంస్థలను కార్పోరేట్లకు కారుచౌకగా కట్టబెట్టడానికి ప్రయత్నిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ ఉపాధ్యక్షుడు ఎం. తిరుపతిరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యదర్శి యు.వేంకటేశ్వర్రావు, తదితరులు పాల్గొన్నారు.

9 నుంచి శ్రీలలితాపీఠం బ్రహ్మోత్సవాలు



బ్రహ్మోత్సవాల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న పీఠం ఉత్తరాధికారి దత్తేశ్వరానంద భారతీ మహాస్వామి

సీతంపేట: శ్రీలలితాపీఠం 76వ బ్రహ్మోత్సవాలు ఈ నెల 9వ తేదీ నుంచి 12వ తేదీ వరకు విశేష పూజాకార్యక్రమాలతో వైభవంగా జరుగుతాయని పీఠం ఉత్తరాధికారి దత్తేశ్వరానంద భారతీ మహాస్వామి తెలిపారు. ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను ఆదివారం పీఠంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుర్తాళం శంకరాచార్యులు, లలితా పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి ఆశీసులతో మాఘ శుద్ధ ద్వాదశి నుంచి మాఘ పౌర్ణమి వరకు బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ మాట్లాడుతూ 9వ తేదీన ఉత్సవాలకు అంకురార్పణ, 10వ తేదీ ఉదయం లలితా కామేశ్వరుల కల్యాణోత్సవం, 11వ తేదీ ఉదయం అమ్మవారికి అన్నాభిషేకం, అనంతరం బంగారు చీరలో అమ్మవారు భక్తులకు దర్శనం ఇస్తారని తెలిపారు. 12వ తేదీన భక్తుల లలితా దీక్ష విరమణలు, గ్రామోత్సవం జరుగుతుందని తెలిపారు.

టెన్నిస్ విజేతలు రాగహర్షిణి, పరిణతి

విశాఖ స్పోర్ట్స్: ఆలిండియా సీనియర్ టెన్నిస్ సంఘం (ఐస్టా) ఆధ్వర్యంలో వెటరన్, చిన్నారులకు నిర్వహించిన పోటీలు ఆదివారం ముగిశాయి. పోటీల్లో విజేతలకు మాజీ డీజీపీ సాంబశివరావు జ్ఞాపికలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలపై చిన్నారులకు తల్లిదండ్రులు ఆసక్తి కలిగించాలన్నారు. ఆఫీసర్స్ క్లబ్‌తో పాటు స్థానిక క్లబ్‌ల్లో 35+నుంచి 70+ వరకు ఐదు కేటగిరీలతో పాటు చిన్నారులకు అండర్ 12,14 కేటగిరీలో పోటీలు నిర్వహించారు. అండర్ 12 బాలికల టైటిల్ పోరులో రాగహర్షిణి 8-5 తేడాతో సుదీక్షపై విజయం సాధించింది. అండర్ 14 బాలికల ఫైనల్స్‌లో వి.పరిణతి 8-2తో సేవితపై విజయం సాధించింది.

అండర్ 12 బాలుర విభాగంలో రేవంత్ రుషి విజేతగా నిలిచాడు. ఆఫీసర్స్‌క్లబ్‌లో ఆదివారం జరిగిన పోటీల ముగింపు కార్యక్రమంలో టోర్నీ డైరక్టర్ సతీష్, ఉపాధ్యక్షుడు ప్రేమ్‌చంద్, కార్యదర్శి డీఎస్ఎన్ రాజు, చిన్నారుల టోర్నీ పర్యవేక్షకుడు కృష్ణంరాజు పాల్గొన్నారు.

ఐక్యపోరాటాలతో పోర్ట్ ఆస్పత్రిని రక్షించుకుంటాం



దీక్షలో మాట్లాడుతున్న నందకుమార్

తాటిచెట్లపాలెం: ఐక్యపోరాటాలతో పోర్ట్ హాస్పటల్‌ను రక్షించుకుంటామని వాటర్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (సీఐటీయూ) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి సీడీ నందకుమార్, టి.నరేందర్ తెలిపారు. విశాఖపట్నం పోర్టు అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో పోర్టు హాస్పటల్ వద్ద జరుగుతున్న రిలే నిరాహారదీక్షలు 125వ రోజుకు చేరాయి. ఆదివారం జరిగిన దీక్షలో పాల్గొన్న టి నరేంద్రరావు,నందకుమార్‌లు మాట్లాడుతూ పోర్టు హాస్పటల్ ప్రైవేటీకరణ నిర్ణయం అనైతికమన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ కార్యదర్శి మసేన్, ఐఎన్‌టీయూసీ హెచ్ఎంఎస్ జాతీయ నాయకులు, సీఐటీయూ నాయకులు, సత్యనారాయణ, జె. సత్యనారాయణ, రామలింగేశ్వర్రావు, శంకర్రావు, కేఎస్ కుమార్, రాఘవులు, విజయ్‌కుమార్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వివేకానందుడి బోధనలు అనుసరణీయం



ప్రశాంతి పార్కులోని వివేకానంద గ్రంథాలయంలో పుస్తక పఠనం చేస్తున్న వీవీవైఎం సభ్యులు

మురళీనగర్: స్వామి వివేకానందుడి బోధనలు అనురణీయమని విశాఖ వివేకానంద యువ మహామండలి అధ్యక్షుడు కె.లక్ష్మీనారాయణ అన్నారు. మురళీనగర్ సెక్టార్-3లోని ప్రశాంతి పార్కులోని వివేకానంద మండపంలో యువతలో పఠనాసక్తిని పెంపొందించేందుకు ఆదివారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత దేశం ప్రతిష్ఠను ప్రపంచ వ్యాప్తం చేసిన మహానుభావుడు వివేకానందుడని ఆయన పేర్కొన్నారు. అనంతరం పార్కులోని వివేనాందుడి గ్రంథాలయంలో పుస్తక పఠనం నిర్వహించారు. కార్యక్రమంలో వీవీవైఎం సీనియర్ సభ్యులు ఎస్.చిననాగేశ్వరరావు, ప్రశాంతి ఆధ్యాత్మిక పార్కు ఉపాధ్యక్షుడు జీవీ రత్నం పాల్గొన్నారు.

‘ఇష్టపది’ పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కూటికుప్పల సూర్యారావు

సీతంపేట: సాహితీవేత్త, ఆల్ ఇండియా రేడియో సీనియర్ అనౌన్సర్ బండి సత్యనారాయణ పదవీ విరమణ సందర్భంగా ఆయన సాహిత్యంపై ప్రముఖ రచయితలు రాసిన వ్యాస సంకలనం ‘ఇష్టపది’ పుస్తకావిష్కరణ సభ ఆదివారం ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో జరిగింది. ఆచార్య బేతవోలు రామబ్రహ్మం అధ్యక్షతన జరిగిన సభలో పద్మశ్రీ డాక్టర్ కూటికుప్పల సూర్యారావు చేతుల మీదుగా పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ పుస్తకాన్ని సావిత్రి భాయిపూలే చారిటబుల ట్రస్టు చైర్మన్ గూడూరు సీతామహాలక్ష్మికి అంకితమిచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బండి సత్యనారాయణ బహుగ్రంథ సాహితీకర్త అని, బౌద్ధ సాహిత్యంలో ఆయనది అందెవేసిన చేయి అనికొనియాడారు. ఆల్ ఇండియా రేడియోలో సీనియర్ అనౌన్సర్‌గా విశేష సేవలందించిన బండి సత్యనారాయణ ఎన్నో పుస్తకాలు రాశారని తెలిపారు. కార్యక్రమంలో రాధ కుసుమ, సి.సుబ్బారావు, కె.ఇందిర పాల్గొన్నారు.

ఉత్సాహంగా నడక పోటీలు



నడక పోటీలో పాల్గొన్న వాకర్స్

మురళీనగర్ : మురళీనగర్ వాకర్స్ క్లబ్ 30వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం నడక పోటీలు నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు ననపల భానుప్రకాష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలను వాకర్స్ ఇంటర్నేషనల్ అదనపు సెక్రటరీ జనరల్ రాళ్లపల్లి సత్యనాథం జెండా ఊపి ప్రారంభించారు. పోటీలను 41-50, 51-60, 61-70, 70 ఆపైన వయసు కలిగిన వారిని ప్రత్యేక విభాగాలుగా పురుషులు, మహిళలకు ప్రత్యేకంగా నిర్వహించారు. పోటీల్లో 93 మంది పాల్గొన్నారు. విజేతలకు ఈనెల 4న నిర్వహించే వార్షికోత్సవం కార్యక్రమంలో బహుమతులు అందజేస్తారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి సీహెచ్ఎస్ఎస్‌వీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వీధి దీపాలకు మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్..



మరమ్మతుల అనంతరం మద్దిలపాలేనికి వచ్చే మార్గంలో విద్యుత్ దీపం

సీతమ్మధార : సత్యం జంక్షన్ నుంచి మద్దిలపాలేనికి వచ్చే మార్గంలో విద్యుత్ దీపాలకు మరమ్మతులు చేశారు. ఆదివారం సాక్షిలో వచ్చిన ‘పగలే వెన్నెల’ కథనానికి అధికారులు స్పందించారు. జోన్-3 పబ్లిక్ వర్క్స్ విభాగం ఇంజినీర్లు విద్యుత్ దీపాలకు మరమ్మత్తులు చేపట్టారు. ఈ ప్రాంతంలో కొన్ని చోట్ల ఉదయం, రాత్రి విద్యుత్ దీపాలు వెలుగుతూనే ఉన్నాయి. మరికొన్ని చోట్ల రాత్రి సమయంలో దీపాలు వెలగడం లేదు. వీటిని సిబ్బంది సరిచేశారు.

సీసీ కెమెరాల ప్రారంభం



సీసీ కెమెరాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

మత్రిపాలెం: జీవీఎంసీ 53వ వార్డులో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు ప్రారంభించారు. సాయినగర్ కాలనీలో సాయినగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో క్రైం ఏసీపీ లక్ష్మణరావు, కంచరపాలెం ట్రాఫిక్ సీఐ దాశరధి, ఎయిర్‌పోర్టు సీఐ ఉమామహేశ్వరరావు, ఎస్‌ఐలు, జనసేన నేతలు, తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఫోర్తుటౌన్ ఎస్ఐ వెంకటరావు



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ చేస్తున్న ద్వారకా సీఐ వీవీ రమణ

సీతమ్మధార : రౌడీయిజం చేస్తే చర్యలు తప్పవని ఫోర్తు టౌన్ ఎస్ఐ జి. వెంకటరావు రైడీ షీటర్లను హెచ్చరించారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో రౌడీషీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. అలాగే వేలి ముద్రలతో పాటు సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ నగర పోలీస్ కమిషనర్ డా.శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ద్వారకా స్టేషన్‌లో...

రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని ద్వారకా సీఐ వీవీ రమణ హెచ్చరించారు. తగాదాలు, కొట్లాటల్లో తల దూర్చకుండా కుటుంబాలతో హాయిగా జీవించాలన్నారు. ఈ మేరకు స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు ధర్మేంద్ర, శ్రీను, సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న స్టోరీ టెల్లింగ్



పిల్లలకు కథ చెబుతున్న ప్రముఖ కథకులు ఎం.సీతా శ్రీనివాస్



పేపర్‌తో తయారు చేసిన లాంతర్లను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

సీతంపేట: విశాఖ పౌరగ్రంథాలయం, భారతీయ విద్యాభవన్స్ సంయుక్తంగా ఆదివారం ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో నిర్వహించిన మియావాకీ స్టోరీ సెషన్ అలరించింది. ప్రముఖ కథకులు ఎం.సీతా శ్రీనివాస్ చైనీస్ న్యూయర్ సంప్రదాయాలను ఆకర్షణీయమైన కథ ద్వారా పిల్లలకు వివరించారు. చైనీస్ న్యూయర్ వేడుకలు, అదృష్టాన్ని సూచించే డ్రాగన్స్, దుష్టశక్తులను పారదోలే తాళాలు, ఎరుపు రంగు అదృష్టానికి చిహ్నంగా చైనీస్ నమ్ముతారని, వారి ఆచార సంప్రదాయాలను కథ ద్వారా వివరించారు. అనంతరం ఓరగామిలో పేపర్‌తో లాంతర్ తయారీని నేర్పించారు. పిల్లలు తయారు చేసిన పేపర్ లాంతర్లను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలలకు చెందిన 80 మంది పిల్లలు పాల్గొన్నారు.

కాపుజాతి అభ్యున్నతికి కృషి



బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న కర్రి వెంకట రమణ

సీతంపేట: ఐక్యతతో కాపుజాతి అభ్యున్నతికి కృషి చెయ్యాలని కాపు సంక్షేమ భరోసా కేంద్రాల వ్యవస్థాపకులు కర్రి వెంకట రమణ అన్నారు. అక్కయ్యపాలెం బస్టాప్ వెనుక గ్రీన్‌బెల్ట్‌లో గల వంగవీటి మోహనరంగా విగ్రహం వద్ద కాపు సంక్షేమ భరోసా కేంద్రాల సభ్యులు ఆదివారం సమావేశమయ్యారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాపు జాతిలో ఎవరికీ ఎటువంటి ఆపద వచ్చిన వెంటనే సహాయం చేసుకోవడం కాపు భరోసా కేంద్రాల ఉద్దేశమని తెలిపారు.భరోసా కేంద్రాల ద్వారా ఉమ్మడి విశాఖ గ్రామీణ ప్రాంతంలో ఇప్పటికే పలువురికి ఆర్థిక, స్వయం ఉపాధి మార్గాలు చూపించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా కాపు సంక్షేమ భరోసా కేంద్రాల బ్రోచర్లు ఆవిష్కరించారు. కొనదం అమ్మమణి, నందికోళ్ల సుబ్బయ్య, గొర్లె మూలకోటి, బారుకుల జగ్గారావు, తోటా రామంజనేయులు, వెలిరెడ్డి శ్రీనివాసరావులను పలు నియోజకవర్గాలకు కన్వీనర్లుగా నియమించారు.

కేంద్ర బడ్జెట్‌పై ఉపాధ్యాయ సంఘం హర్షం

సీతమ్మధార: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ సామాన్యులకు మేలు చేసేదిగా ఉందని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు అరుణ్ కుమార్, త్రినాథమూర్తి హర్షం వ్యక్తం చేశారు. రూ.12 లక్షల వరకు వార్షిక ఆదాయంపై ఎలాంటి పన్ను ఉండబోదని, జీతభత్యాలకు ఈ పరిమితిని రూ.12 లక్షల 75 వేలకు పెంచుతున్నట్లు ఆర్థిక మంత్రి ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. అలాగే 75 వేల అదనపు మెడికల్ సీట్లు, దేశవ్యాప్తంగా 50 వేల పాఠశాలల్లో అటల్ టింకరింగ్ ల్యాబ్‌లను ఏర్పాటు చేయడానికి ప్రతిపాదించడం హర్షణీయమన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ



ర్యాలీ చేస్తున్న త్రీస్టార్ వాకర్స్ సభ్యులు

కంచరపాలెం: స్థానిక కంచరపాలెం ఇండస్ట్రీయల్ ఎస్టేట్ త్రీ స్టార్ వాకర్స్ క్లబ్‌లో ‘క్యాన్సర్ డే’ ను పురస్కరించుకుని వాకర్స్ క్లబ్ గౌరవాధ్యక్షుడు పెతకంశెట్టి సుకుమార్ ఆధ్వర్యంలో ఆదివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం మహాత్మాగాంధీ క్యాన్సర్ ఆస్పత్రి నేతృత్వంలో వాకర్స్ సభ్యులకు క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమంలో నిర్వహించారు. కార్యక్రమంలో త్రీస్టార్స్ వాకర్స్ అధ్యక్షుడు జయతి ఉమామహేశ్వరరావు, కార్యదర్శి కాళ్ల వెంకటప్రసాద్, ఉపాధ్యక్షుడు జె.రమేష్‌కుమార్, కోశాధికారి కిషోర్‌కుమార్, సహాయ కార్యదర్శి ఇమ్మానుయేల్, జాలీ వాకర్ ఏఎల్ నరసింహారావు, వాకర్స్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.